విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 165 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|




## ఇకపై 100 మార్కులకు ఎగ్జామ్స్

- తెలంగాణ పదో తరగతి విద్యార్థులకు అలర్ట్
- ఇంటర్నల్ మార్కుల విధానం పూర్తిగా రద్దు
- మార్కుల విధానంలో భారీ మార్పులు
- 2024-25 విద్యా సంవత్సరం నుంచే అమలు
- ఉత్తర్వులు జారీచేసిన తెలంగాణ విద్యాశాఖ

హైదరాబాద్,
రాష్ట్రంలోని పదో తరగతి మార్కుల విధానంలో మార్పులు జరిగాయి. ఇకపై పదో తరగతి పరీక్షలను 100 మార్కులకే నిర్వహించనున్నారు. ప్రస్తుతం పదో తరగతిలో 20 ఇంటర్నల్ మార్కులు, 80 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది.

-మిగతా 3 లో





## విద్యార్థులను కన్నబిడ్డల్లా చూడాలి

ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన సీఎం

- తరచూ స్కూళ్లు, హాస్టళ్లను తనిఖీ చేయాలి
- శుభ్రమైన వాతావరణంలో పౌష్టిక ఆహారం అందించాలి..
- జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం....
- వసతి గృహాల్లో జరుగుతున్న ఘటనలపై సీఎం రేవంత్ ఆగ్రహం...
- బాధ్యులైన వారిపై వేటు వేయాలని ఆదేశం..
- పిల్లల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,
విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అంచించాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తరచూ స్కూళ్లు, గురుకులాలను తనిఖీ చేయాలన్నారు.

-మిగతా 3 లో



## పార్టీ మార్పుపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేం

- తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- కేఏ పాల్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్,
పార్టీలు మారిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ నిర్ణయాల్లో జోక్యం చేసుకోకుండా, తీర్మానాల్లో ఓటు వేయకుండా ఆదేశించాలని తన పిటిషన్ లో పాల్ కోరారు. ప్రజలు ఎన్నుకున్న

-మిగతా 3 లో



## మేడారం అభివృద్ధికి ప్రభుత్వం ఫోకస్

- ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- గద్దెల ప్రాంగణం విస్తరణకు చర్యలు
- రహదారుల అభివృద్ధికి ప్రణాళిక
- రూ.17.50 కోట్లు కేటాయింపుకు అడుగులు
- గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు సుముఖత
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

హైదరాబాద్,
మేడారం.. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన వన దేవతల క్షేత్రం. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో వనం కిక్కిరిసిపోతుంది. ఇటీవల నిత్యం వేలాది మంది భక్తులు దర్శనానికి

-మిగతా 3 లో



## ప్రధాని మోడీ హత్యకు ప్లాన్ అంటూ ఫోన్ కాల్

- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

న్యూఢిల్లీ,
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హత్య బెదిరింపులు వచ్చాయి. ఓ మహిళ ముంబై పోలీసులకు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడింది. ప్రధాని హత్యకు ప్లాన్ చేస్తున్నట్లు పేర్కొంది. గురువారం ఉదయం ముంబై పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ప్రధాని హత్యకు ప్లాన్ చేస్తున్నట్లు ఫోన్ చేసిన వ్యక్తి బెదిరించారు.

-మిగతా 3 లో


## రుణమాఫీ పేరుతో పంగనామాలు



- రైతు భరోసాకు ఎగనామం
- పంటల కొనుగోళ్లకు శఠగోపం
- ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగవేత
- దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించన ప్రభుత్వం
- రామన్నపేటను రావణకాష్టం చేసింది
- లగచర్ల రైతులను జైలుపాలు చేసింది
- రైతులకు కాంగ్రెస్ ఏమీ చేసిందని రైతు పండుగ?
- అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?
- కాంగ్రెస్ రైతు పండుగపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్,
రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చెయ్యలేదని బీఆర్ఎస్ లబోదిబోమంటుంటే.. కాంగ్రెస్ మాత్రం రైతు పండుగను 3 రోజులు చేసేందుకు భారీ ప్లాన్ వేసింది. లక్షల మంది రైతుల్ని మహబూబ్‌నగర్ జిల్లాకి తరలించబోతోంది. ఇదే బీఆర్ఎస్‌కి నచ్చట్లేదు. రైతులకు కాంగ్రెస్ సర్కార్ ఏమీ చెయ్యకపోగా, రైతు పండుగ చెయ్యడమేంటని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు.ఇలాంటి అంశాలపై తరచూ

-మిగతా 3 లో




## తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

- రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు..!
- పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో హెచ్చరికలు

హైదరాబాద్,
తెలంగాణకు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. నేటినుంచి పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని అంచనా వేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. నైరుతి బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం నెమ్మదిగా కదులుతుంది.

-మిగతా 3 లో

## వయనాడ్ ఎంపీగా ప్రియాంకగాంధీ ప్రమాణస్వీకారం



ముంబై,
కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంకా గాంధీ వయనాడ్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ప్రియాంక తన తల్లి, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ, సోదరుడు, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష

-మిగతా 3 లో

# మరోసారి ఢిల్లీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

### నేడు ఏఐసీసీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం



హైదరాబాద

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నెల 29న ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశానికి ఏఐసీసీ పెద్దలు, పార్టీ అగ్రనేతలు, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన ఢిల్లీకి వెళ్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారు.

# మరో 3 లక్షల మందికి త్వరలో రుణమాఫీ


### ఈనెల 30న ఖాతాల్లోకి డబ్బులు
### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్,

రుణమాఫీ కాని వారిని డబ్బులు జమ చేయటంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. బుధవారం షాద్ నగర్ లో మాట్లాడిన ఆయన పలు కారణాలతో రుణమాఫీ జరగని 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీన మహబూబ్ నగర్ లో జరగనున్న రైతుపండగ సందర్భంగా డబ్బులు జమ చేస్తామని ప్రకటన చేశారు.రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఖర్చు చేశామని.. మిగతా రైతులకు కూడా అందజేస్తామని తెలిపారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియకు సమయం తీసుకోవటంతో పలువురు రైతులకు మాఫీ కాలేదని చెప్పారు. వ్యవసాయ శాఖాధికారులు గత 3 నెలలుగా రైతుల వివరాలు సేకరించారని%ూ% తప్పులను సరిచేశారని వివరించారు.వీరందరికీ ఈనెల 30వ తేదీన డబ్బులు చేస్తామని స్పష్టం చేశారు. కాగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ స్కీమ్ ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అధిక సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం.. వారి వివరాలను సేకరించింది. కుటుంబ నిర్ధారణ చేసేందుకు మూడు నెలలపాటు సమయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి కావటంతో రుణమాఫీ కాని వారికి స్కీమ్ ను వర్తింపజేయనుంది.

# ఢిల్లీలో పెరిగిన చలి తీవ్రత



న్యూఢిల్లీ,

దేశరాజధాని ఢిల్లీలో చలి తీవ్రత పెరిగింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం ఉదయం అత్యంత శీతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. భారత వాతావరణ శాఖ ప్రకారం.. ఢిల్లీలో గురువారం ఉదయం ఉష్ణోగ్రతలు 10.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. సాధారణం కంటే 0.2 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇంత తక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి అని ఐఎండీ తెలిపింది. మరోవైపు ఇవాళ ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. వాయువ్య దిశ నుంచి వీస్తున్న గాలులే ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమని ఐఎండీ తెలిపింది. శుక్రవారం నాటికి 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం ఢిల్లీ వాసులు చలి తీవ్రతకు గజగజ వణుకుతున్నారు. చలికి తోడు ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కాలుష్య స్థాయిలు కూడా అధికంగానే ఉన్నాయి. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. గురువారం ఉదయం 9 గంటల సమయానికి ఢిల్లీ ఎన్సీఆర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 313గా నమోదైంది. ఇది చాలా పేలవమైన కేటగిరీ కిందకు వస్తుంది.

# ఉభయ సభలు నేటికి వాయిదా




న్యూఢిల్లీ,

పార్లమెంట్ ఉభయసభల్లో వరుసగా మూడో రోజు కూడా రభస కొనసాగింది. అమెరికాలో అదానీ సంస్థపై కేసుకు సంబంధించి చర్చ చేపట్టాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. దాంతో ముందుగా ఉభయసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభలు పునఃప్రారంభమైన తర్వాత కూడా ఉభయసభల్లో సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో సభలు రెండు రేపటికి వాయిదాపడ్డాయి. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారాలు చేశారు. వాయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా, నాందేడ్ ఎంపీగా రవీంద్ర వసంత్‌రావు చవాన్ ప్రమాణం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆ తర్వాత ప్రతిపక్షాలు అదానీ అంశంపై చర్చకు పట్టుబట్టడంతో రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా అదే పరిస్థితి నెలకొనడంతో రేపటికి వాయిదా పడింది.

# 1,190 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్


### భారీ నష్టాలను మూటకట్టుకున్న దేశీయ స్టాక్ మార్కెట్లు
### భారీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



న్యూఢిల్లీ,

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు భారీ నష్టాలను మూటకట్టుకున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అనుసరించనున్న విధానాలు, వాణిజ్య యుద్ధ భయాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నెలకొన్న అనిశ్చితి మార్కెట్ల పతనానికి కారణమయింది. ఐటీ స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,190 పాయింట్లు నష్టపోయి 79,043కి దిగజారింది. నిఫ్టీ 360 పాయింట్లు కోల్పోయి 23,914కి పడిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ లో ఇన్ఫోసిస్ (-3.46%), మహీంద్రా అండ్ మహీంద్రా (-3.36%), బజాజ్ ఫైనాన్స్ (-2.84%), అదానీ పోర్ట్స్ (-2.73%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ టాప్ లూజర్లుగా ఉన్నాయి.

# జమ్ముకశ్మీర్‌లో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రత



హైదరాబాద్ : జమ్ముకశ్మీర్‌లో భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు భయాందోళన చెందారు. తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. గురువారం సాయంత్రం 4.19 గంటలకు భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్) తెలిపింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రత నమోదైనట్లు పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్, తజికిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది. భూమి లోపల 209 కిలోమీటర్ల దూరంలో భూకంపం సంభవించినట్లు వివరించింది. కాగా, భూకంపం వల్ల జమ్ముకశ్మీర్‌లోని లోయ ప్రాంతంలో భూ ప్రకంపనలు కనిపించాయి. భూమి కంపించడంతో ప్రజలు భయాందోళన చెందారు. తమ ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని లోయ ప్రాంతంలో గతంలో కూడా భూకంపాలు సంభవించాయి. భారీగా విధ్వంసం సృష్టించాయి.

# మహా ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్!?

### -బీజేపీ వద్దే కీలక మంత్రి పదవులు!
### -శివసేనకు 12 మందికి మంత్రి పదవులు
### -అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 9మంత్రి పదవులు




ముంబై,

మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై స్పష్టత వచ్చినట్లు తెలిసింది. బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ఈ మేరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు ఎన్డీఏ పక్షాలకు స్పష్టతనిచ్చినట్టు తెలుస్తున్నది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక ముఖ్యమంత్రితోపాటు సగానికిపైగా మంత్రి పదవులను బీజేపీ తన వద్దే ఉంచుకోనున్నట్లు తెలిసింది. మహారాష్ట్రలో సీఎంతో సహా అత్యధికంగా 43 మంది మంత్రులను నియమించుకునే వీలుంటుంది. ఇందులో షిండే నేతృత్వంలోని శివసేనకు 12, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 9 మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇందులో షిండే వర్గానికి మూడు కీలక మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పట్టణాభివృద్ధి, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, జలవనరులు లభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. కాగా, ఈ విషయంలో బుధవారం శివసేన నేత ఏక్ నాథ్ షిండే కొంత స్పష్టతనిచ్చారు. మహాయుతి కూటమి నుంచి ఎవరిని సీఎంగా ఎంపిక చేయాలనే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కి కూటమి నేతలు అప్పగించారు. ప్రధాని మోదీ నిర్ణయమే ఫైనల్ అని, ఆ నిర్ణయాన్ని తామంతా అంగీకరిస్తామని ఏక్ నాథ్ షిండే చెప్పారు. ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏక్ నాథ్ షిండే మాట్లాడుతూ ప్రధాని మోదీ తమ కుటుంబ పెద్ద అని అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ నాయకత్వం తనను అడ్డంకిగా భావించరాదని ఆయన అన్నారు. తన వల్ల మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు ఏదైనా సమస్య వస్తుందని ఎలాంటి సందేహం పెట్టుకోవద్దని, మీరు ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయం తనకు ఆమోదయోగ్యమేనని ప్రధానికి చెప్పానని షిండే వెల్లడించారు. "నన్ను అడ్డంకిగా చూడొద్దని ప్రధాని మోదీకి, అమిత్ షాకు చెప్పాను. వారు ఏ నిర్ణయం తీసుకున్నా నేను కట్టుబడి ఉంటాను" అని చెప్పారు. మహారాష్ట్ర సీఎం పదవికి సంబంధించి బీజేపీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తమ పార్టీ మద్దతు ఇస్తుందని షిండే చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్ణయానికి తను, శివసేన కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. తాను సామాన్యుడిగానే పనిచేశానని, తనను తాను ఎప్పుడూ ముఖ్యమంత్రిగా భావించలేదని షిండే అన్నారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చానని, రాష్ట్ర ప్రజల బాధలు, కష్టాలను అర్థం చేసుకోగలనని, వారి కష్టాలు తీర్చడమే తన లక్ష్యమని చెప్పారు. ఒక సీఎంగా శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే, ప్రధాని మోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించానని చెప్పారు. "గత రెండున్నరేళ్లలో నేను చేసిన పనులతో చాలా సంతృప్తిగా ఉన్నాను. నేను కలత చెందే రకం కాదు. ప్రజల కోసం పోరాడే, పోరాడే వ్యక్తిని" అని ఆయన అన్నారు. ఏక్ నాథ్ షిండే బుధవారం మళ్లీ ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని మోదీ , అమిత్ షాలతో మహాకూటమి మిత్రపక్షాల సమావేశం కూడా జరగనుంది. కాగా, సీఎం పదవిపై ఏక్ నాథ్ షిండే వైఖరికి మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ బవాన్ కులే కృతజ్ఞతలు తెలిపారు. "ఆయన ఎప్పుడూ కేంద్ర నాయకత్వాన్ని గౌరవించారు. పాటించారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఇచ్చిన ప్రతి సూచనను ఆయన పాటించారు. ఆయన నిజమైన మహాకూటమి నాయకుడిగా వ్యవహరించారు. అందుకు ఆయనకు ధన్యవాదాలు, అభినందనలు" అన్నారు.

# జార్ఖండ్ రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

### 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరేన్ ప్రమాణ స్వీకారం

రాంచి, జార్ఖండ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. రాంచీ లో జరిగిన ఈ కార్యక్రమానికి హేమంత్ సోరెన్ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు శిబు సోరెన్, రూపి సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజశ్వి యాదవ్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునితా కేజ్రీవాల్, ఎంపీ రాఘవ్ చద్దా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

www.prajaswecha.com ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# విద్యార్థులకు కన్నబిడ్డల చూడాలి

(మొదటి తరువాయి)

వసతి గృహాల్లో ఆహార కల్తీకి బాధ్యులైనవారి వేటు వేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల స్కూళ్లలో ఉన్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

# మేడారం అభివృద్ధికి ప్రభుత్వం ఫోకస్

(మొదటి తరువాయి)

వస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందిచనుంది. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర.. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. గతంలో కేవలం జాతర సమయంలోనే భక్తులు వచ్చేవారు. కానీ ఇప్పుడు నిత్యం వేల మంది అమ్మవార్ల దర్శనం కోసం వస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడారం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని నిర్ణయించింది. నాలుగు దశాబ్దాల కిందట దాతలు నిర్మించిన గద్దెల ప్రాంగణమే ఇప్పటికీ అందుబాటులో ఉంది. జాతరకు ముందు అప్పుడప్పుడు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. కానీ శాశ్వతంగా అభివృద్ధి చేయడం లేదు. గద్దెల ప్రాంగణం వద్ద ఎలాంటి మార్పులు చేయకపోవడంతో.. జాతర సమయంలో భక్తుల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇప్పటికే మేడారం వెళ్లే రహదారుల అభివృద్ధికి రూ.17.50 కోట్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.3.50 కోట్లు మంజూరు చేసి.. పనులు చేపట్టారు.తాజాగా.. వనదేవతల గద్దెల ప్రాంగణంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందినట్లు అధికారులు చెబుతున్నారు.సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొనేందుకు పస్రా, చింతల్, కొండాయి, తాడ్వాయి మీదుగా మేడారంలో ప్రవేశించి.. గద్దెల ప్రాంగణానికి చేరుకొనేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.అమ్మవార్ల గద్దెల ప్రాంగణానికి చేరుకున్న తర్వాత.. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి, ప్రశాంత దర్శనం రెండో ప్రాధాన్యతగా పనులు చేపట్టనున్నారు.దాదాపు ఎకరం స్థలంలో దేవతల గద్దెలు, ప్రాంగణం ఉంది. దీంతో భక్తుల దర్శనానికి గంటలకొద్దీ సమయం పడుతోంది. రాబోయే రోజుల్లో అన్నిరకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే.. హడావుడిగా కాకుండా ప్రణాళికబద్ధంగా నిర్మించేందుకు మాస్టర్‌ప్లాన్ సిద్ధమవుతోంది. .మేడారం అభివృద్ధిపై మంత్రి సీతక్క స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇటీవల అధికారులతో సమీక్షించారు. గద్దెల ప్రాంగణం, మేడారం రోడ్ల విస్తరణకు శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. దేవతల దర్శనం, సౌకర్యాల కల్పనతో మేడారానికి మంచి పేరు తీసుకురావాలని ఆదేశించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రైవేటు ఏజెన్సీ సేవలను వినియోగించుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. వాటికి అనుమతి రాగానే మాస్టర్ ప్లాన్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు.

# తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

(మొదటి తరువాయి)

గడిచిన 6 గంటల్లో గంటకు 2 కిమీ వేగంతో కదులుతుందని ఐఎండీ తెలిపింది. చెన్నైకి 480 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది.రాగల 12 గంటల్లో శ్రీలంక తీరాన్ని దాటి ఉత్తర-వాయువ్య దిశగా పయనమవుతుందని అంచనా వేసింది.ఉదయంలోపు తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. శనివారం (నవంబర్ 30వ తేదీ) ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్ మరియు మహాబలిపురం మధ్య తీవ్ర వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉందని తాజా బులెటిన్ లో పేర్కొంది. ఈ ప్రభావంతో 3 రోజులు ఏపీలోని దక్షిణకోస్తాలో అక్కడక్కడ భారీ వర్షాలు,రాయలసీమలో శుక్ర,శనివారాల్లోఅక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలినచోట్ల విస్తారంగా తేలికపాటి-మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.శనివారం దక్షిణకోస్తా,రాయలసీమలో కొన్నిచోట్ల భారీ-అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.మరోవైపు తెలంగాణకు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. తుఫాన్ ప్రభావంతో రేపట్నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. నేడు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక నవంబర్ 30వ తేదీన కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. డిసెంబర్ 1వ తేదీన తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.డిసెంబర్ 2వ తేదీన తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జగనాం, సిద్ధిపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. మళ్లీ డిసెంబర్ 3,4 తేదీల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

-మొదటి స్థానంలో నిలిచిన రోహిత్ ధోండ్గే

-వరుసగా రెండు, మూడు స్థానాల్లో హర్షిత్ పాండే, లక్ష్మీకాంత్




**న్యూఢిల్లీ,**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ యూపీఎస్సీ ఈఎస్ఈ మెయిన్స్ 2024 రాసిన అబ్యర్థుల మార్కులను గురువారం విడుదల చేసింది. యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (మెయిన్) ఎగ్జామినేషన్, 2024కు హాజరైన అభ్యర్థులు యూపీఎస్సీ అధికారిక వెబ్సైట్ ద్వారా తమ మార్కులను చెక్ చేసుకోవచ్చు. యూపీఎస్సీ ఈఎస్ఈ మెయిన్స్ ఫలితాలు 2024 నవంబర్ 23న విడుదలయ్యాయి. మొత్తం 206 మంది అభ్యర్థుల నియామకానికి సిఫార్సు చేయగా, వారిలో 92 సివిల్ ఇంజనీరింగ్, 18 మెకానికల్ ఇంజనీరింగ్, 26 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, 70 మంది ఇ అండ్ టి ఇంజనీరింగ్ అభ్యర్థులు ఉన్నారు. ఎంపికైన వారిలో జనరల్ కేటగిరీలో అత్యధికంగా 71 మంది, ఓబీసీల్లో 59 మంది, ఎస్సీల్లో 34 మంది, ఈడబ్ల్యూఎస్ లో 22 మంది, ఎస్టీల్లో 20 మంది ఉన్నారు. కాగా యూపీఎస్సీ ఈఎస్ఈ 2024 మెయిన్ లో ఉత్తీర్ణత సాధించిన వారిలో రోహిత్ ధోండ్గే మొదటి స్థానంలో నిలవగా, హర్షిత్ పాండే, లక్ష్మీకాంత్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్ష జూన్ 2024లో జరిగింది, ఇంటర్వ్యూ లేదా పర్సనాలిటీ టెస్ట్ అక్టోబర్ 7, 8, 9, 10, 14, 15, 16, 17, 18, 21, 22, 23, 24, 25, నవంబర్ 4, 5, 6 తేదీల్లో జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండో షిఫ్ట్ చొప్పున రెండు షిఫ్టుల్లో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ రిక్రూట్ మెంట్ డ్రైవ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సంస్థలో 251 ఖాళీలను భర్తీ చేయనుంది.

# ఇకపై 100 మార్కులకు ఎగ్జామ్స్

(మొదటి తరువాయి)

ఇకపై 100 మార్కులకు ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ నూతన విధానం అమల్లోకి వస్తుందని విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

(మొదటి తరువాయి)

# పార్టీ మార్పుపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేం

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలు పార్టీలు మారితే ప్రజల్లో నమ్మకం పోతుందని చెప్పారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకపోతే పార్టీలు మారడం సహజమైపోతుందని తెలిపారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు... పిటిషన్ ను కొట్టివేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ పరిధిలో ఉందని హైకోర్టు తెలిపింది. ఈ అంశంపై తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఇటీవల వెలువరించిన తీర్పులో పేర్కొన్నామని చెప్పింది. స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే సదరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా ఆదేశించలేమని స్పష్టం చేసింది.

# ప్రధాని మోడీ హత్యకు ప్లాన్ అంటూ ఫోన్ కాల్

(మొదటి తరువాయి)

దీంతో అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్‌ను ట్రేస్ చేయగా.. 34 ఏళ్ల మహిళ ఈ బెదిరింపులకు పాల్పడినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన మహిళను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. సదరు మహిళ మానసిక పరిస్థితి బాగోలేదని పోలీసులు భావిస్తున్నారు.

# రుణమాఫీ పేరుతో పంగనామాలు

(మొదటి తరువాయి)

లో ట్వీట్లు పెట్టే కేటీఆర్.. తాజాగా మరోసారి అదే చేశారు. ఓ భారీ ట్వీట్ పెట్టారు.. అందులో.. "సిగ్గు లేదా జీడిగింజా అంటే - నల్లగున్నా నాకేం సిగ్గు అన్నదంట! రైతు భరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో పంగనామాలు పెట్టి, పంటల కొనుగోళ్లకు శఠగోపం పెట్టి, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగ్గొట్టి, దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించి, రామన్నపేటను రావణకాష్టం చేసి, లగచర్ల రైతులను జైలుపాలు చేసి, అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "రైతు పండుగలా ? పండుగలు మీకు, పస్తులు రైతులకు, చెప్పింది బారానా, చేసింది చారానా, కల్లాల్లో ధాన్యం పోసి, కళ్లల్లో వత్తులు వేసుకొని, కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు. నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో, అడ్డికి పావుశేరు లెక్కన దళారులకు అమ్ముకుంటున్నారు" అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

# వయనాడ్ ఎంపీగా ప్రియాంకగాంధీ ప్రమాణస్వీకారం

(మొదటి తరువాయి)

నేత రాహుల్ గాంధీతో కలిసి పార్లమెంట్‌కు చేరుకున్నారు. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ఆమెతో ప్రమాణం చేయించారు. పోడియం వద్దకు వెళ్లిన ప్రియాంక.. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక.. చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌తోపాటు.. ప్రియాంక పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష రాజీకాయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు.

# నేడు దీక్షా దివస్..

-తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు

-అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

**హైదరాబాద్,**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్దపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమం ఏర్పాట్లను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, దీక్ష దివస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి ఇంచార్జి పొన్నాల లక్ష్మయ్య, సికింద్రాబాద్, అంబర్ పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీమంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇంచార్జిలు ఆనంద్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తెలంగాణా ఉద్యమాన్ని కీలకమలుపు తిప్పిందని చెప్పారు.

# సంపాదకీయం

## పోలీస్ రాజ్యం ఎవరిదో ప్రజలింకా మర్చిపోలేదు!

అప్పుడప్పుడు దెయ్యాలు వేదాలు వల్లిస్తుంటాయి. నరరూప రాక్షసులు మానవత్వంపై ప్రవచనాలు వినిపిస్తుంటారు. అబద్ధాలకోరులు నిజాలను భుజాలపై నిలబెడుతున్నామంటూ గప్పాలు కొడుతుంటారు. నియంతలు ప్రజాస్వామ్యానికి కాపాలా కుక్కలమంటూ భుజాలు చరుచుకుంటారు. అవినీతిపరులు నీతినిజాయితీలకు నిలువుటద్దాలమంటూ స్వోత్కర్షలకు పాల్పడు తుంటారు. పదేళ్ల పాటు కీరిటం లేని చక్రవర్తిలా, యువరాజులా గుర్తింపు పొందిన కేటీఆర్ వీటన్నింటికీ అసలు సిసలు ప్రతిరూపం తమ పాలన స్వర్ణయుగమనీ తమ పాలనా కాలంలో అవలంబించిన విధానాలతోనే తెలంగాణ పారిశ్రామిక అనుకూల రాష్ట్రంగా మారిందని అధికారంలో ఉన్నప్పుడూ, అధికారం కోల్పోయిన తర్వాతా కేటీఆర్ పలు వేదికలపై చెప్పుకొచ్చారు. అదే కేటీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తుంటే అడ్డుకునే కుట్రలకు తెరలేపారు. పరిశ్రమలకు భూ సేకరణ ఎక్కడైనా కొంత ఇబ్బందులతో కూడుకున్నదే. ఏళ్లుగా భూమిని నమ్ముకున్న రైతులు వాటిని వదులుకునేందుకు ఇష్టపడరు. ఆ అనుబంధాన్ని పూడ్చలేకపోయినా భూమికి సరైన నష్ట పరిహారం ఇచ్చి మరోచోట భూమి కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తుంటాయి. ఈ క్రమంలోనే లగచర్లలోనూ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణకు ప్రభుత్వం ప్రయత్నించింది. రైతుల్లో కొంత ఆందోళన ఉన్నా పరిశ్రమ ఏర్పాటు ఆవశ్యకత, కలిగే లబ్ధి, భూములు కోల్పోయే వారికి ఇచ్చే పరిహారం తదితర అంశాలపై చర్చించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అక్కడకు వెళ్లారు. ముందుగా పన్నిన కుట్ర ప్రకారం ఆయనను గ్రామం లోనికి పిలిపించిన బీఆర్ఎస్ గూండాలు కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడడంతో పాటు వారి వాహనాలను ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో సెంటు భూమి లేని ఓ గుండా నేతృత్వంలోని అల్లరిమూక అధికారులపై దాడులకు తెగబడింది. దీనిని ఖండించాల్సిన కేటీఆర్ భూ నిర్వాసితులపై కేసులు పెడుతున్నారంటూ, ఆడవారిని లైంగిక వేధింపులకు గురి చేశారంటూ, దళితులూ గిరిజనులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారంటూ తప్పుడు ఆరోపణలతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు గుండెలు బాదుకుంటూ తిరుగుతున్నారు. తమ పార్టీ నేతలు కుట్రపూరితంగా చేసిన వ్యవహారాన్ని కప్పిపుచ్చుకోవడానికి కొత్త కొత్త వాదనలు తెరపైకి తెస్తున్నారు. దాడులకు తెగబడిన బీఆర్ఎస్ అరాచక ముఠా నాయకుడు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పదులసార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ లేవని బుకాయిస్తున్నార రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఒక హాస్యాస్పదమైన ప్రకటనను కేటీఆర్ చేశారు. పోలీసు రాజ్యం గురించి బీఆర్ఎస్ పాలకులకు, కేటీఆర్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. పోలీస్ రాజ్యానికి తార్కాణంగా నిలిచిన ఉదంతాలు గత పదేళ్ళ పాలనలో లెక్కలేనన్ని జరిగాయి. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో రోజుల తరబడి సాగుతున్న ఇసుక దోపిడీని పండగ రోజైనా ఆపమని అడిగిన నేరెళ్ల దళితులను రాత్రిళ్లు ఇళ్ల నుంచి ఎత్తుకువెళ్లి రోజుల తరబడి థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. మా సమస్యలు చెప్పుకుంటాం ధర్నా చౌక్‌కు వెళ్లనివ్వాలని కోరిన వర్గాలను ఇళ్లలో నుంచి బయటకు రానివ్వకుండా నిర్బంధించారు. ప్రతిపక్ష నేతలు, వివిధ రంగాల ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేసి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు పొందారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మిర్చి పంటను తక్కువ ధరకు దోచుకోవడంపై ఆందోళన చేసిన గిరిజన రైతులకు ఉగ్రవాదుల మాదిరి సంకెళ్లు వేసి నడిపించారు. దళిత మహిళ మరియమ్మను లాకప్‌లో చంపారు. ప్రతిపక్ష నేతలు రేవంత్‌రెడ్డి, జగ్గారెడ్డిల ఇళ్లలోకి అర్ధరాత్రులు చొరబడి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ఇంటి తలుపులను గొడ్డళ్లతో నరికి ఆయనను అరెస్టు చేశారు. నోరెత్తిన నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులపై కేసులపై కేసులు మోపి జైళ్లకు పంపారు. ప్రశ్నించిన మీడియాను వంద అడుగుల లోతున పాతరేస్తామని రంకెలు వేశారు. అధికారం పోయిన ఏడాదిలోనే ఇన్ని తప్పులను కేటీఆర్ మర్చిపోయారా? లేక ప్రజలకు ఆ మాత్రం జ్ఞాపకశక్తి ఉండదనే చిన్నచూపుతో 'పోలీసు రాజ్యం' అన్న పదం వాడారా? ఆయనకే తెలియాలి. మానవ హక్కులు, జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ బీసీ కమిషన్, రాజ్యాంగ విలువలూ అంటూ తనకు బొత్తిగా తెలియని, తానెప్పుడూ విలువ ఇవ్వని అంశాలపై కేటీఆర్ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తున్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితుడు ఆరె కనకరాజు మృతదేహాన్ని గ్రామానికి తరలించకుండా హైదరాబాద్‌లో గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు జరిపించినప్పుడు కేటీఆర్‌కు మానవ హక్కులు గుర్తుకు రాలేదా? నేరెళ్ల బాధితులను రోజుల తరబడి హింసించినప్పుడు, కేసుల నుంచి తన వారిని తప్పించేందుకు వారిని బ్లాక్‌మెయిల్ చేసినప్పుడు జాతీయ ఎస్సీ కమిషన్ గుర్తుకురాలేదా? పోడు భూములు సాగు చేస్తున్నారంటూ ఖమ్మం జిల్లా ఎల్లన్న నగర్‌లో 18 మంది గిరిజన మహిళలు, అందులో ఏడాది లోపు పిల్లలున్న ముగ్గురు తల్లులను అరెస్టు చేయించి జైళ్ల పాలు చేసినప్పుడు మానవత్వం, మానవ హక్కులు, జాతీయ ఎస్టీ కమిషన్, పోలీసు రాజ్యం... ఇవేమీ కేటీఆర్‌కు గుర్తులేవా? ఢిల్లీకి మూటలు మోస్తున్నారని పదే పదే కేటీఆర్ విమర్శలు చేయడం పరమ ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణలో దోచుకున్న వందల కోట్ల రూపాయలతో దేశవిదేశాల్లో కేటీఆర్ కుటుంబం వ్యాపారం చేస్తోందనే ఆరోపణలున్నాయి. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో దిగి వంద కోట్ల రూపాయలు చేతులు మారడంలో కింగ్‌పిన్ కల్వకుంట్ల కవిత అని సీబీఐ, ఈడీ తమ ఛార్జిషీట్లలో పేర్కొన్న విషయం కేటీఆర్‌కు తెలియదా? ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే కేటీఆర్ కుటుంబం మూసివేసిన ధర్నా చౌక్‌ను తిరిగి తెరిపించారు. ఆ ధర్నా చౌక్‌లో కూర్చొనే కేటీఆర్, ఆయన బావ హరీశ్‌రావు తిట్ల పురాణం వినిపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోలీసు రాజ్యంపై నమ్మకం లేనందునే కేటీఆర్ సోషల్ మీడియా కాలకేయ సైన్యం నిత్యం ఆయనపై, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్య పదజాలంతో విషం చిమ్మగలుగుతోంది. ముఖ్యమంత్రికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉండబట్టే ఇంకా బీఆర్ఎస్ మాజీ మంత్రులు, కార్యకర్తలు ఇష్టారీతిగా విమర్శలు చేయగలుగుతున్నారు.

# పెను సవాళ్లకు దారితీయనున్న వర్గీకరణ ప్రయత్నాలు




కోటా తీర్పుపై శాసనిక చర్యలేవీ?' శీర్షికన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ రాసిన వ్యాసంలో (24%-10-%2024) ఆయన మాలలపై అక్కసుతో అబద్ధ ప్రచారాల పరంపరను మరోసారి కొనసాగించారు. గత ఆగస్టు ఒకటో తేదీన దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి ఇచ్చిన తీర్పు కక్షిదారులకన్నా దాని ప్రభావిత వర్గాలను తీవ్రమైన ఆందోళనకు గురిచేసింది. ప్రధానంగా ఉత్తర భారత దళితులు ఈ తీర్పును అంగీకరించేది లేదని ఆందోళనలు చేస్తున్నారు. తీర్పుకు వ్యతిరేకంగా జరిగిన భారత్ బంద్‌లో ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా మాదిగ సామీప్య కులం లాంటి చమార్ కులస్తులు అధికంగా ఉన్న ప్రాంతాలలో, విజయవంతం కావడమే అందుకు నిదర్శనం. తీర్పుపై వేసిన అనేక రివ్యూ పిటీషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిజానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఇచ్చిన ఏ తీర్పుపై కూడ రివ్యూ పిటీషన్లను ఆయన అనుమతించలేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిజర్వేషన్ల భవితవ్యంపై నిపుణులను ఆందోళనకు గురిచేస్తున్నది. నిజానికి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2014లో రెండుగా విడిపోయిన తర్వాత వర్గీకరణ డిమాండ్‌కు మునుపటి ప్రాధాన్యత లేకుండే. కాని 2023 నవంబర్ 11న సికింద్రాబాద్ సభలో ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీ మేరకు కేంద్రంలో రాజీవ్ గౌభా నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత అన్నీ చకచకా జరిగిపోయినవి. ఇరవై సంవత్సరాల అనంతరం అనూహ్యంగా 2024 ఫిబ్రవరి 6న సుప్రీంకోర్ట్ రివ్యూ పిటిషన్‌ను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేసింది. వర్గీకరణ వాదులకు రెండురోజులు, వ్యతిరేకులకు ఒకరోజు మాత్రమే వాదనలను అనుమతించడంతోనే రాబోయే తీర్పును చాలామంది ముందుగానే ఊహించినారు. ఇది ఖచ్చితంగా రాజకీయ ప్రేరేపిత తీర్పు. 565 పేజీల తీర్పును క్షుణ్ణంగా పరిశీలిస్తే, అనేక సంక్లిష్ట అంశాల ప్రస్తావన కూడా తీర్పులో ఉంది. ఎస్సీ ఎస్టీ ఉపకులాలు సజాతీయులు కారంటూ, ఎస్టీ వర్గీకరణను కూడా ఉటంకిస్తూ క్రీమీలేయర్ ప్రస్తావన తెచ్చింది. 'ఎంపరికల్ డాటా' అధారంగా అనేది అనేక సంక్లిష్టతలతో కూడుకొన్నది. దీని ప్రకారం ముందుగా జనాభా లెక్కలు తీయాలి. ఇది కేంద్ర ప్రభుత్వం మాత్రమే చేయాలి. 2011 జనాభా లెక్కల అనంతరం రాష్ట్రం విడిపోయింది కాబట్టి ప్రజల వలసలు జరిగిన నేపథ్యంలో పాత లెక్కలు రెండు రాష్ట్రాలకూ ఎంతమాత్రం ప్రామాణికం కాజాలవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన 2014 నుంచి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన సుమారు పదహారు రకాల స్కీముల ఆర్థిక ప్రయోజనాలు పొందిన లబ్ధిదారుల కులం లెక్కల సేకరణ, ప్రకటన జరగాలి. సుప్రీం తీర్పులో జనాభా, నిష్పత్తి పంపిణీ ప్రస్తావన లేదు. అయినా జనాభా శాతం కన్నా ఎక్కువ పొందినవారిని వెనుక వరుసలోను, తక్కువ ప్రయోజనం పొందిన వారిని ముందు వరుసలోను ఉంచడమే సహజ న్యాయం. డేటాలో తేడాలు ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్ళవచ్చు అని తీర్పులోనే సూచించింది. ఇదంతా 'ఇష్టాలు లేదా రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా' జరగాలని కూడా పేర్కొంది. అసలు అన్నింటికీ మించి ఉమ్మడి రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యోగాల స్థానికత విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఆర్టికల్ 371డి పరిష్కరించడం న్యాయశాఖకు ఒకపెద్ద సవాలే. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో అమలవుతున్న జిల్లా జోనల్ మల్టీ జోనల్ స్థాయి కేటగిరీ పోస్టుల్లో వర్గీకరణ ఎలా చేస్తారనేది మిలియన్ డాలర్ ప్రశ్న. 2011 జనాభా లెక్కల ఆధారంగా ముందుకు వెళ్తే గతంలో మాలలకు 6శాతం, మాదిగలకు 7శాతం కేటాయించిన వాటాలను అలాగే కొనసాగించాలి. ఏ గ్రూపుకు 1శాతం, డి గ్రూపుకు 1శాతం, రెండు గ్రూపులకు కేటాయించిన వాటాలను కలిపి ఏ గ్రూపుగా 2శాతం, ఉషామెహ్రా కమిషన్ రిపోర్ట్ పేజీ 54 ప్రకారం తెలంగాణలో మాదిగలకన్నా వెనుకబడిన మాలలను బీ గ్రూపుగా 6శాతం, దగా పడ్డామంటూనే అన్ని రంగాల్లోనూ అగ్రభాగాన ఉన్న మాదిగలను సీ గ్రూపుగా 7శాతం నిర్ణయించి కేటాయించడమే శాస్త్రీయ వర్గీకరణ అవుతుంది. పంజాబ్ రాష్ట్రంలో అమలవుతున్న 25శాతం ఎస్సీ రిజర్వేషన్లను ఏ - బీ అనే రెండు గ్రూపులుగా మాత్రమే వర్గీకరించిన అంశాన్ని ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలి. 1965లో బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాల కులాన్ని ఎస్సీ జాబితా నుంచి తొలగించమని సిఫారసు చేసిందంటూ కృపాకర్ రాసిన రాతలు అబద్ధం. అలాంటి డిమాండ్ అర్ధరహితమైనదని 116 పేజీల బిఎన్ లోకూర్ కమిటీ రిపోర్టు పేజి నెంబర్ 56లో తిరస్కరించింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇటువంటి అబద్ధపు రాతలు రాస్తూ, మాదిగ శ్రేణులను రెచ్చగొడుతూ, సమాజాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గం. సుప్రీంకోర్టు తీర్పును న్యాయకోవిదులతో పరిశీలన చేయించకుండానే, 'ఎంపరికల్ డేటా' సేకరణ జరగకుండానే, కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో తన విధానమేమిటో ప్రకటించకుండానే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసే ప్రక్రియకు పూనుకొని ముందుకు వెళ్తున్నది. మంత్రివర్గ ఉపసంఘంలో ఇప్పటివరకు అగ్రభాగ ఫలాలు అనుభవించిన కులాల ప్రతినిధులను సభ్యులుగా ఉంచడం ఎవరి మెప్పుకోసమో కాలమే సమాధానం చెప్తుంది. ఏనుగును ఏడుగురు గుడ్డివారు ఏడురకాలుగా వర్ణించినట్లు వర్గీకరణ తీర్పును పలువురు పలురకాలుగా వక్రీకరిస్తున్నారు. చికిత్స చేసేముందు రోగనిర్ధారణ చేసి చికిత్సకు పూనుకోవాలి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా చికిత్సకు ఏర్పాట్లు చేసి రోగనిర్ధారణ ప్రయత్నాలు చేస్తున్నది. ఇరు వర్గాలను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ చివరకు రెంటికీ చెడ్డ రేవడై మిగిలినా ఆశ్చర్యం లేదు

# బంగ్లాదేశ్ లో మైనార్టీలను తరిమివేసే విద్వేష క్రీడ!




ఈ ఏడాది జులైలో ప్రధాని షేక్ హసీనా అధికారం నుంచి వైదొలిగిన నాటి నుంచి బంగ్లాదేశ్ లోని హిందూ మైనార్టీలు లక్ష్యంగా తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. హసీనాను దించివేసే క్రమంలో మొదలైన అల్లర్లు, దారుణాలు పెరుగుతున్నాయే కానీ తగ్గ లేదు. హిందవులు లక్ష్యంగా ఈ అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ ఆ దేశంలో మైనారిటీల దుస్థితికి తాజా ఉదాహరణ. మైనారిటీల హక్కుల కోసం గళం విప్పే దాస్ బంగ్లాదేశీ జాతీయ పతాకాన్నిఅవమానించారంటూ దేశద్రోహ నేరం మోపారు. ఆయనను అరెస్ట్ చేసి, బెయిలివ్వకుండా కస్టడీకి పంపారు. అంతేకాదు, అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం(ఇస్కాన్)పై నిషేధం విధించనున్నట్టు బంగ్లా సర్కార్ ప్రకటించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోందని అటార్నీ జనరల్(ఏజీ) వెల్లడించారు. ప్రభుత్వం ఇస్కాన్ ని మత సంస్థగా పేర్కొంది. చిన్మయ్ అరెస్టు నేపథ్యంలో ఈ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. ఇస్లాం అధికారిక మతమైనా, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా, సమానత్వానికి రాజ్యాంగ బద్ధులమని చెప్పుకొనే బంగ్లా ఆ మాటకు తగ్గట్టు వ్యవహరించడం ఎప్పుడో మానేసింది. అందుకు తగ్గట్టే తాజాగా 'ఇస్కాన్'ను ర్యాడికల్, మత ఛాందసవాద సంస్థ అని బంగ్లా అటార్నీ జనరల్ అభివర్ణించడం ఆందోళనకరం. ఆధ్యాత్మిక చైతన్యం, పీడిత జన సముద్ధరణ కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాల్లో పనిచేస్తున్న ఒక సంస్థపై అలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవడం బుద్ధిలేని పని. మరోవైపు, చిన్మయ్ అరెస్టును భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్‌ను తలపిస్తోందని అధికార బీజేపీ నేతలు మండిపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

÷–రస్తుతం బంగ్లాదేశ్‌లోభారత్‌పై వ్యతిరేక ప్రచారాన్ని పెంచే కార్యక్రమం నడుస్తోంది. తీవ్రవాద శక్తులను ప్రోత్సహించడం వంటివి బంగ్లాదేశ్‌ను పూర్తి అరాచక రాజ్యంగా మారుస్తున్నా యన్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చర్యలే ఇందుకు కారణమని చెప్పాలి. హిందూ, బౌద్ధ దేవాలయాలపై దాడులు తరచూ జరుగుతున్నాయి. దేశంలో ఏదో ఒక చోట మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. షేక్ హసీనా రాజీనామా అనంతరం.. గతంలో నిషేధానికి గురైన 'బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీ' వంటి తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతున్నాయి. ఈ తీరును చూస్తుంటే మైనార్టీ వ్యతిరేక భావజాలం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. హసీనా వెళ్లిపోయిన తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ శూన్యత ఏర్పడింది. అదే సమయంలో తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిలో విదేశీ జోక్యం ఉందనే వారి వాదనను కొట్టిపారేయలేము. ఢాకాలోని పాక్ రాయబార సంస్థ ముందు చోటుచేసుకుంటున్న కార్యకలాపాలు ఇందుకు ఉదాహరణ. కొన్ని తీవ్రవాద సంస్థలతో పాకిస్థాన్ సన్నిహితంగా మెలుగుతోందనేది బహిరంగ రహస్యం. మైనారిటీలను పూర్తిగా తరిమేసి, బంగ్లాను హిందూ రహిత దేశంగా మార్చాలనే కుట్ర దీని వెనక ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ అల్లర్లు, అల్పసంఖ్యాక హిందువులపై దాడుల వెనుక మత ఛాందస జమాతే ఇస్లామీ ఉందనేది స్పష్టం. హసీనా సర్కారు కాలంలో నిషేధానికి గురైన ఈ ర్యాడికల్ గ్రూపు, అలాగే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)లు యూనస్ యంత్రాంగంలో భాగమే. అసలు ఈ ప్రయత్నమంతా ఇస్లామిక్ షరియత్‌ను ప్రవేశపెట్టి, బంగ్లాదేశ్‌ను ప్రజాస్వామ్య ఎన్నికలు, పార్లమెంట్‌తో పని లేని దేశంగా మార్చాలనే వ్యూహంలో భాగమని ఒక వాదన వినిపిస్తోంది. మరోవైపు, జూలై నాటి ప్రజా ఉద్యమంతో ఆఫ్ఘనిస్తాన్ లాగానే బంగ్లాను తమ ప్రయోగశాలగా చేసుకోవాలని పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్నట్టుంది. అప్పుడిక బంగ్లా మరో తీవ్రవాద కేంద్రంగా మారే ప్రమాదముంది. అది భారత్‌కే కాదు... యావత్ ప్రపంచానికి నష్టం. నిజానికి, ఆసియా ? పసిఫిక్ కూటమిలో బంగ్లాను భాగం చేసుకొని, లబ్ది పొందాలని అమెరికా భావించింది. హసీనా సర్కార్ అందుకు ఒప్పుకోకపోవటంతో అది కుదరలేదు. మొన్నటి అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలవడం బంగ్లాకు చెడు పరిణాయం. మధ్యంతర సర్కార్ సారథి ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ కు ట్రంప్ ద్వేషి గా పేరుంది. ట్రంప్ పగ్గాలు చేపట్టాక బంగ్లాపై కఠినవైఖరి అవలంబిస్తారని యూనస్‌కు తెలుసు. అందుకే, ఆలోగా మైనారిటీలపై అల్లర్లను ఆఖరి అస్త్రంగా చేసుకున్నారనే వాదన కూడా ఉంది. 1930లో బంగ్లాలో 30 శాతం పైగా ఉన్న హిందువులు ఇప్పుడు కేవలం 8 శాతానికి పడిపోయారనే వాస్తవం అక్కడ జరుగుతుందో చెప్పకనే చెబుతోంది. ప్రాణ భయంతో బతుకుతున్నఅక్కడి హిందువులను కాపాడేందుకు భారత ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిం చాల్సివుంది.

# 4 జిల్లాల్లో 10 డిగ్రీలలోపే నమోదు..?






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్లో అత్యల్పంగా 7.9 డిగ్రీలు**

**-29 జిల్లాల్లో 14 డిగ్రీలలోపే టెంపరేచర్లు**

**-పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**-మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి ఉండే చాన్స్**

హైదరాబాద్ :ప్రజా స్వేచ్ఛ

చలితో రాష్ట్రం గజగజలాడుతున్నది. రాత్రి టెంపరేచర్లు విపరీతంగా పడిపోతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ 15 డిగ్రీల కన్నా తక్కువ టెంపరేచర్లే రికార్డు అవుతున్నాయి. ఏజెన్సీ ఏరియాలతోపాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి.కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదవుతున్నది.కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డిల్లో 10 డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్లో అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా అర్లిటిలో 9.2, కామారెడ్డి జిల్లా డోంగ్లిలో 9.5, సంగారెడ్డి జిల్లా న్యాల్కల్లో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట టెంపరేచర్లు రికార్డయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా, వికారాబాద్ జిల్లాల్లో 10.1, నిజామాబాద్, మెదక్లో 10.2, నిర్మల్ జిల్లాలో 10.3, రంగారెడ్డి జిల్లాలో 10.6, జగిత్యాలలో 10.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మొత్తంగా 29 జిల్లాల్లో 14 డిగ్రీల కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.మిగతా జిల్లాల్లో 15 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ అత్యల్ప ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. శేరిలింగంపల్లిలో అత్యల్పంగా 11.6 డిగ్రీల కనిష్ట టెంపరేచర్ నమోదైంది.దీంతో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.దక్షిణాదిన 4 జిల్లాల్లో తక్కువ చలితీవ్రతరాష్ట్రంలోని 4 దక్షిణాది జిల్లాల్లో టెంపరేచర్లు కాస్తంత ఎక్కువగానే రికార్డవుతున్నాయి. సూర్యాపేట, ఖమ్మం, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయి. మిగతా అన్ని జిల్లాల్లోనూ 14 డిగ్రీలలోపు రికార్డవుతున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ కంటిన్యూ అవుతుండగా.. మరో 25 జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతున్నది.ఉత్తర భారతం నుంచి వీస్తున్న గాలులతో రాష్ట్రంలో టెంపరేచర్లు భారీగా పడిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరికొద్ది రోజులపాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని అంటున్నారు.జిల్లా టెంపరేచర్

సిర్పూర్ (ఆసిఫాబాద్) 7.9 డిగ్రీలు
అర్లి టి (ఆదిలాబాద్) 9.2 డిగ్రీలు
డోంగ్లి (కామారెడ్డి) 9.5 డిగ్రీలు
న్యాల్కల్ (సంగారెడ్డి) 9.7 డిగ్రీలు

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# రూ.10 నాణేలు తీసుకోవట్లే..

**-ఆర్బీఐ నిబంధనలు పట్టని వ్యాపారులు**

**-ఇబ్బందులు పడుతున్న కొనుగోలుదారులు**





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ

అన్ని వర్తక సముదాయాల్లో కొనుగోలుదారుల ఇచ్చే 10, 20 నాణేలు తీసుకోవాలని, లేకపోతే జైలుకి వెళ్ళాల్సి ఉంటుందని ఆర్బీఐ తాజా ప్రకటన జారీచేసిన సంగతి విదితమే. కానీ దీనికి విరుద్ధంగా కొందరు వ్యాపారులు నాణేలను తిరస్కరిస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటక, యూపీ తదితర రాష్ట్రాల్లో ఇవి చెల్లుబాటులో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాల్లో ఎందుకు చెల్లుబాటు కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు జీవనోపాధిని వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వలస వస్తుంటారు.అలా వచ్చినవారు ఆ రాష్ట్రాల్లో చెల్లుబాటవుతున్న 10, 20 నాణేలను కొనుగోలు నిమిత్తం ఇస్తుంటే ఇక్కడ తిరస్కరిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు అన్ని షాపుల్లో ఇవి చెల్లేవిధంగా అధికారులు చర్యలు చేపట్టడంతో పాటు వ్యాపారులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. డిజిటల్ మనీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే, అమెజాన్‌పే, భారత్‌పే, ఏటీఎంలకు అలవాటు పడి 10, 20 నాణేలు, కొంచెం చిరిగిన నోట్లను తిరస్కరిస్తున్నారు.డిజిటల్ పేమెంట్‌లు తెలియనివారు తమవద్ద ఉన్న నాణేలను ఏమిచేయాలో తెలియని సందిగ్ధంలో ఉన్నారు. 10, 20 నాణేలు చెల్లుబాటులోనే ఉన్నాయని వాటిని తిరస్కరిస్తే ఐపీసీ సెక్షన్ 124 ప్రకారం ఫిర్యాదు చేయాలని, విచారణలో రుజువైతే మూడు సంవత్సరాల వరకు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆర్బీఐ ఉత్తర్వుల్లో పేర్కొంది..

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# ఉప్పెనై కదులుదాం....
# దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం....





కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ

సమైక్య రాష్ట్ర సంకెళ్ళను తెంచి, తల్లి తెలంగాణ విముక్తి కోసం బిఆర్ఎస్ అధినేత, ఉద్యమ నేత కెసిఆర్ 2009 నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను స్మరించుకుంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సూచనల మేరకు రేపు గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించబోయే దీక్షా దివాస్ కార్యక్రమం విజయవంతం చేయుటకై కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జిహెచ్ఎంసిలోని డివిజన్లు, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన తోనే అభివృద్ధి సాధ్యమని భావించిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ "తెలంగాణ వచ్చుడో... కెసిఆర్ సచ్చుడో" అనే ఉద్యమ పంథాలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ వారిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు అని అన్నారు. ఈ సన్నాహక సమావేశాల్లో భాగంగా....

**125 - గాజులరామారం డివిజన్...**

దీక్ష దివాస్ కార్యక్రమం విజయవంతం పై గాజులరామారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, అడ్వకేట్ కమలాకర్, ప్యాక్స్ డైరెక్టర్ పరిష శ్రీనివాస్ యాదవ్, ఇబ్రహీం ఖాన్, అజయ్ గుప్తా, నవాబ్, తారా సింగ్, తిరుపతి యాదవ్, సుజాత, దూలప్ప, చందు ముదిరాజ్, చందు గౌడ్, సురేష్, చిన్న బాబి, శివ భాస్కర్, మూసాఖాన్, సుధాకర్, ఉపేందర్ రెడ్డి, చెట్ల వెంకటేష్, నారాయణ, హనుమంతు నాయక్, ఆసిఫ్, గౌస్ సుధాకర్ పాల్గొన్నారు.

**130 - సుభాష్ నగర్ డివిజన్....**

దీక్షా దివాస్ కార్యక్రమ సన్నాహక సమావేశంలో భాగంగా సుభాష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అధ్యక్షతన వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పలు కాలనీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**131 - కుత్బుల్లాపూర్ డివిజన్...**

దీక్షా దివాస్ కార్యక్రమ సన్నాహక సమావేశంలో భాగంగా మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్ గారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, మహేష్, నజీర్, మధుకర్ రెడ్డి, వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**132 - జీడిమెట్ల డివిజన్...**

దీక్షా దివాస్ సన్నాహక సమావేశంలో భాగంగా 132 - జీడిమెట్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సన్నాహక సమావేశంలో సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్, ఎల్లా గౌడ్,నరేందర్ రెడ్డి, సంపత్ గౌడ్, తోకల నగేష్ రెడ్డి, యేసు, ఆటో బలరాం, నదిమ్ రాయ్, అనిల్, బాల మల్లేష్, జిల్లా నాయకురాలు అరుణ, కల్పన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ

ఈ రోజు, నవంబర్ 28, 2024న, సామాజిక సంస్కర్త మరియు బహుజన చైతన్య నాయకి మహాత్మా జ్యోతిరావు ఫూలే యొక్క వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ హాల్ లో, పొన్నం అశోక్ గౌడ్ గారు ఫూలే గారి జాతి వివక్షను ఎదుర్కొనేందుకు చేసిన అనిత్ కృషిని, మరియు మహిళల upliftment కోసం వారి పోరాటాన్ని ప్రశంసించారు. ఆయనను ఆశ యొక్క కాంతి, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకుడిగా అభివర్ణించారు. ఫూలే గారి దృష్టితో ప్రేరితంగా ప్రారంభించిన వివిధ సామాజిక న్యాయం మరియు సంక్షేమ పథకాలను కూడా పూనినారు. నివాళి కార్యక్రమంపొన్నం అశోక్ గౌడ్ మరియు ఇతరులు జ్యోతిరావు ఫూలే గారి చిత్రపటానికి పువ్వులమాలలు వేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమైన వ్యక్తులు జల్లి సిద్దయ్య, రమణ రావు, ఉమా శంకర్ గారు, మోమిన్ రోషన్ జమీర్ సాహెబ్, రాపర్తి వెంకటేష్ గారు, కమలాకర్ గారు, అభిలాష్ ఆశ్రిత్ గారు, హరిన్దర్ గారు, శ్రీనివాస్ గారు, వెంకటగోపాల్ గౌడ్ గారు, పి. గణేష్ గారు, శిల్పా గారు, రాజ్‌కుమార్ గారు, రాజేష్ గారు, దాసరి శ్రీనివాస్ గారు, ఎస్. ఎం. ఆర్. హష్మీ గారు, ఎస్. ఎస్. రావు, షోయెబ్ సాహెబ్, సత్యనారాయణ మూర్తి గారు, ఒమర్, సోహైల్, ఇతర లీగల్ సెల్ సభ్యులు మరియు అడ్వకేట్స్ పాల్గొన్నారు.

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# జహీరాబాద్ ఎంపీని అభినంధించిన రాహుల్ గాంధీ

నారాయణఖేడ్,ప్రజా స్వేచ్ఛ

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్ ను ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, పార్లమెంట్ ప్రతిపక్ష నేత,ఎంపీ రాహుల్ గాంధీ అభినందించారు.మహారాష్ట్ర నాందేడ్ పార్లమెంట్ ఉపఎన్నికలో ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి ఎంపీ అభ్యర్థి బలవంత్ రావు రవీందర్ చవాన్ గెలుపులో కీలక పాత్ర పోషించినందున గురువారం పార్లమెంట్ లో ప్రియాంక గాంధీ, బలవంత్ రావు రవీందర్ చవాన్ ల ప్రమాణస్వీకారం అనంతరం పార్లమెంట్ ఆవరణలో సురేష్ కుమార్ షేట్కార్ రాహుల్ గాంధీ అభినందించారు..



# నవంబర్ 29... గురునానక్ జయంతి



**ప్రజా స్వేచ్ఛ**

పదిమంది సిక్కు గురువులలో ప్రధములు గురునానక్ దేవ్. 1469లో పాకిస్తాన్ లోని ప్రస్తుతం లాహెూర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్య దినాన నవంబర్ 29న హిందూ కుటుంబంలో జన్మించారు. హిందూ ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కుమతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగు తున్నది. ఐదవ గురువు అర్జున్ తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు. నానక్ తండ్రి కళ్యాణ్ చంద్ దాస్ కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీ నాన్కీ, నానక్ దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలో చించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవ న్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందని వాదించారు. అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్మునిలో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నాన క్ జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూ మతంలోని తాత్వికతకు ఆకర్షితులై జీవిత రహస్యాల అన్వేషణకై ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్ దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్ లను కలుసుకున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్ చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, ,లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలిగారు – 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానానికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు. తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేదు, ముస్లిమూ లేదు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్ దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగిం చారు. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్ పూర్ లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత, ధన బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి, జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక అక్టోబర్ 10న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు.

# కార్మిక శాఖ కార్యాలయంలో ఆన్లైన్ సేవలు

**సహాయ అధికారి గిరిరాజు**



**నారాయణఖేడ్,ప్రజా స్వేచ్ఛ**

నారాయణఖేడ్ లోని సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో ఆన్లైన్ సేవలు ప్రారంభించిన్నట్లు సహాయ కార్మిక శాఖ అధికారి గిరిరాజు అన్నారు.గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలోని కార్మికుల సౌకర్యార్థం, వారికి మెరుగైన సేవలు అందించడానికి, సేవలు సులభతరం కోసం ఖేడ్ లోనే ఆన్లైన్ సేవలు ప్రారంభించాము అన్నారు. ఇంతకుముందు ఖేడ్ కార్యాలయంలో ఆన్లైన్ సేవలు లేకపోవడంతో జిల్లా కార్యాలయానికి వెళ్ళాల్సి వచ్చేది అన్నారు.ఇకముందు ఖేడ్ లోనే కొత్త లేబర్ కార్డ్ నమోదు,పాత కార్డు రినివల్ చేసుకోవడం,కార్డు దారులకు రావాల్సిన బెనిఫిట్స్ అన్ని ఇక్కడినుండి ఆన్లైన్ చేసుకోవచ్చు అన్నారు.ఇట్టి అవకాశాన్ని ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోగలరు అన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సాయులు,అటెండర్ నర్సింలు తదితరులు ఉన్నారు.

# నవోదయ కాలనీ లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం





**-పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ,గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**శేరిలింగంపల్లి ప్రజా స్వేచ్ఛ**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులు తో సమావేశమై ఎక్కడ ఉన్నా సమస్యలు అడిగి తెలుసుకునీ నెలకొన్న సమస్యలపై సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ , గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా తమ కాలనీలో ఎన్నాళ్ళుగానో ఉన్న డ్రైనేజీకి అవుట్ లెట్ సమస్య చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు శ్రీ ఆరెకపూడి గాంధీ గారిని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గా ని కోరగా.. వారు తక్షణమే స్పందించి అక్కడే ఉన్న అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. డ్రైనేజీకి అవుట్ లెట్ ను ఏర్పాటుచేసి, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిపాదనలు సిద్ధం కాగానే నిధులు మంజూరు చేయించి త్వరగా పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తామని తెలిపారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తలెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.ఇప్పటికే డివిజన్ పరిధిలో అనేక సమస్యలను పరిష్కరించామని, ఇంకా ఏ సమస్యలు ఉన్న పరిష్కరిస్తామని ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈ విశాలాక్షి, జలమండలి మేనేజర్ అభిషేక్ రెడ్డి నరేంద్ర రెడ్డి,నవోదయ కాలని అధ్యక్షులు వేంకటేశ్వర రావు,నవోదయ కాలని వాసులు,సీనియర్ నాయకులు స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశంలో ఖేడ్ ఎమ్మెల్యే



**నారాయణఖేడ్,ప్రజా స్వేచ్ఛ**

గాంధీ భవన్ లో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్ లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు.మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు,డీసీసీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి శ్రీమతి దీపాదాస్ మున్షీ,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు,కొండా సురేఖ,సహచర ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో రాజేందర్ రెడ్డి కి సన్మానం



**చేవెళ్ల, నవాపేట్ ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలంగాణ కవుల సంఘం, కళా సూర్య కల్చరల్ ఆర్గనైజేషన్, ఆధ్వర్యంలో రవీంద్ర భారతి హైదరాబాదులో డా,జనువాడ రామస్వామి, రచించిన చిలుకూరు సుందరేశ్వర శతకం, పుస్తక ఆవిష్కరణ లో రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో దాతాపూర్ కు చెందిన పోలీస్ రాజేందర్ రెడ్డి, అమ్మ పైన కవిత గానం చేసినందుకు గాను, ముఖ్య అతిథి డాక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు, అనుముల ప్రభాకరా చారి, వెంకట నారాయణ, చేతుల మీదుగా సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు.రాజేందర్ మాట్లాడుతూ..తెలుగు భాష గొప్పతనం, మన తెలుగు బాషాను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



**శేర్లింగంపల్లి ప్రజా స్వేచ్ఛ**

వివేకానంద నగర్ డివిజన్ లోని రిక్షా పుల్లర్స్ కాలనీ లో గల జ్యోతిరావు పూలే విగ్రహానికి వారి వర్ధంతి సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక తత్వవేత్త,ఉద్యమకారుడు ,సంఘసంస్కర్త, దిగువ కులాల సమాన హక్కుల కొరకు ,అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం , మహిళా విద్య కోసం పోరాడిన వ్యక్తి అని,భారత దేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన జ్యోతిరావు పూలే దంపతులు అని అన్నారు. నేటితరం జ్యోతిరావు పూలే ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, మధు ,మల్లేష్, కృష్ణ, యశ్వంత్, జగదీష్ గౌడ్, ప్రవీణ్, విక్రమ్, కిరణ్, విద్యాసాగర్, రవీందర్రావు, బాబు, రవి, శ్రీనివాస్, బద్రి, లడ్డు, మాధవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ఇన్స్పెక్టర్ రమా దేవిని మర్యాదపూర్వకంగా కలిసిన టి.జే.యం.యు. నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా స్వేచ్ఛ**

సుజాత నగర్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రమా దేవిని తెలంగాణ జర్నలిస్టు మీడియా యూనియన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....సమాజంలో మీడియా పాత్ర చాలా గొప్పదని సమాజానికి ఉపయోగపడే విధంగా మీడియా సమస్య ఏమైనా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమం లో టి.జే.యం.యు. జిల్లా అధ్యక్షులు కురిమెళ్ళ శంకర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పుల రమేష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కుల పాల్గొన జిల్లా ఉపాధ్యక్షులు కత్తి బాలకృష్ణ నియోజకవర్గ అధ్యక్షులు ప్రేమ్ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు సతీష్ మహేష్ తదితరులు ఉన్నారు.

## బిజినెస్

### వెండి ధర భారీగా కోత.. రూ.90 వేల దిగువకు.. స్వల్పంగా తగ్గిన బంగారం..!



దేశీయ బులియన్ మార్కెట్లో అనిశ్చితి కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం కిలో వెండి ధర రూ.4,900 క్షీణించి రూ.90,900లకు పడిపోయింది. తద్వారా మూడు వారాల కనిష్ట స్థాయికి చేరుకున్నది. బుధవారం ఒక్కరోజే కిలో వెండి ధర రూ.5,200 పుంజుకుని రూ.95,800 పలికింది. కిలో వెండి ధర అక్టోబర్ 21 తర్వాత 5,000 పెరగడం ఇదే తొలిసారి. ఇంతకు ముందు ఈ నెల నాలుగో తేదీన కిలో వెండి ధర రూ.4,600 పతనమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.100 తగ్గి రూ.78,700 పలికింది. ఇక బుధవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.650 పుంజుకుని రూ.78,800 వద్ద స్థిర పడింది. బుధవారానికి ముందు వరుసగా రెండు సెషన్లలో తులం బంగారం ధర రూ.2,250 క్షీణించింది. మంగళవారం తులం బంగారం ధర 78,150 పలికింది. గురువారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర 78,700 పలికింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ డిసెంబర్ డెలివరీ తులం ధర రూ.167 తగ్గి రూ.75,927 లకు చేరుకున్నది. కిలో వెండి డిసెంబర్ డెలివరీ ధర రూ.115 పతనమై రూ.87,565 వద్ద స్థిర పడింది. అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ లో ఔన్స్ బంగారం ధర 8.20 డాలర్లు వృద్ధితో 2,673 డాలర్లకు చేరుకున్నది. ఇక ఔన్స్ వెండి ధర 0.15 శాతం తగ్గి, 30.51 డాలర్లకు చేరుకున్నది.

# ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ.. మణిపూర్‌సిగ్నాతో చర్చలు

కేంద్ర ప్రభుత్వ రంగ బీమా సంస్థ 'భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)'.. ఆరోగ్య బీమా రంగంలో అడుగు పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. అందుకోసం మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 శాతం వాటా కొనుగోలుకు చర్చిస్తున్నట్లు సమాచారం. ఎల్ఐసీ ప్రస్తుతానికి జీవిత బీమాకు పరిమితమైనా.. తన పోర్ట్ ఫోలియోను ఆరోగ్య రంగానికి విస్తరించడానికి మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ లో వాటా కొనుగోలు ఉపకరిస్తుంది. అమెరికా సిగ్నా కార్పొరేషన్, మణిపాల్ ఎడ్యుకేషన్-మెడికల్ గ్రూప్ జాయింట్ వెంచర్ బీమా సంస్థే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్. ఇందులో మణిపూర్ గ్రూపునకు 51 శాతం, సిగ్నా కార్పొరేషన్‌కు 49 శాతం వాటాలు ఉన్నాయి. ఈ జాయింట్ వెంచర్ కంపెనీలో 50 శాతం వాటా కొనుగోలు కోసం ఎల్ఐసీ చర్చిస్తున్నది. దీనికి అనుగుణంగా రెండు సంస్థలు తమ వాటా తగ్గించుకోనున్నాయి. ప్రస్తుతం చర్చలు ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఓ ఆంగ్ల దినపత్రిక వార్తకథనం. ఆరోగ్య బీమా రంగంలోకి ఎంటర్ కావాలని భావిస్తున్నామని గతంలోనే ఎల్ఐసీ చైర్మన్ సిద్దార్థ్ మొహంతి చెప్పారు. ఇప్పటికే ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న బీమా సంస్థలో వాటాలను కొనుగోలు చేస్తామని, అందుకు కసరత్తు జరుగుతున్నదన్నారు. మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో ఎల్ఐసీ రూ.1750-2000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నదని తెలుస్తున్నది.

# 4 లక్షల కోట్లు.. అప్పులతో టెలికం కంపెనీల సతమతం

దేశీయ టెలికం సంస్థలు రుణాలతో సతమతమవుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి నాలుగు టెలికం సంస్థల అప్పు రూ.4,09,905 కోట్లుగా ఉన్నట్లు పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోకసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ.2.07 లక్షల కోట్లు రుణం ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్లు, జియోకు రూ.52,740 కోట్లు, బీఎస్ఎన్ఎల్ అప్పు రూ.28,092 కోట్లుగా




ఉన్నట్లు చెప్పారు. 2021-22లో బీఎస్ఎన్ఎల్‌కు రూ.40,400 కోట్ల రుణం ఉండగా, కేంద్ర ప్రభుత్వం పలుదఫాలుగా ప్రకటించిన పునరుద్ధరణ ప్యాకేజీతో కంపెనీ రుణం రూ.28,092 కోట్లకు తగ్గినట్లు మంత్రి చెప్పారు. అలాగే బీఎస్ఎన్ఎల్‌కి 4జీ/5జీ స్పెక్ట్రం కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

# బుమ్రాను ఊరిస్తోన్న వరల్డ్ రికార్డ్

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించనున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న బుమ్రాను వరల్డ్ రికార్డ్ ఊరిస్తోంది. మరో వికెట్ తీస్తే ఈ ఏడాది టెస్ట్‌ల్లో 50 వికెట్లు పూర్తి చేసుకోనున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా చరిత్రకెక్కనున్నాడు. ప్రస్తుతం బుమ్రా 49 వికెట్లతో కొనసాగుతున్నాడు. ఈ ఏడాది ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా 3.04 ఎకానమీతో 49 వికెట్లు తీసాడు. ఇందులో మూడు సార్లు ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో ఇటీవల ముగిసిన తొలి టెస్ట్‌లో బుమ్రా 8 వికెట్లతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌కు రోహిత్ శర్మ దూరంగా ఉండటంతో బుమ్రానే భారత జట్టును నడిపించాడు. పిచ్‌ను సరిగ్గా రీడ్ చేసిన బుమ్రా.. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై ఆస్ట్రేలియా బౌలర్లు చెలరేగడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150



పరుగులకే కుప్పకూలింది. అనంతరం భారత బౌలర్లు అసాధారణ ప్రదర్శనతో ఆసీస్ 104 పరుగులకే ఆలౌట్ చేశారు. బుమ్రా ఐదు వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ రాణా మూడు, సిరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. 46 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్.. కోహ్లీ, యశస్వి జైస్వాల్ శతకాలతో ఆసీస్ ముందు 534 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది. పిచ్ ఫ్లాట్‌గా మారడంతో భారత బ్యాటర్లు చెలరేగారు. అయితే అదే ఫ్లాట్ వికెట్‌పై భారత బౌలర్లు ప్రత్యర్థి బ్యాటర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. బుమ్రా, సిరాజ్ మూడేసి వికెట్లతో చెలరేగడంతో ఆసీస్ 238 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు పడగొట్టగా.. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు. దాంతో ఆసీస్ 295 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఆసీస్ గడ్డపై భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. ఇరు జట్ల మధ్య డిసెంబర్ 6 నుంచి అడిలైడ్ వేదికగా రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో బుమ్రా ఒక్క వికెట్ తీసినా.. ఈ ఏడాది 50 వికెట్ల మైలురాయిని అందుకుంటాడు. ఈ మ్యాచ్‌కు ముందు భారత్.. ఆసీస్ దేశవాళీ టీమ్ ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవన్‌తో ప్రాక్టీ మ్యాచ్ ఆడనుంది. నవంబర్ 30న ప్రారంభం కానున్న ఈ వామప్ మ్యాచ్ రెండు రోజుల పాటు జరగనుంది.

## స్పోర్ట్స్

### షమీని నిరంతరం పర్యవేక్షిస్తోన్న బీసీసీఐ వైద్యబృందం



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) డెడ్ లైన్ విధించినట్లు తెలుస్తోంది. చీలమండ గాయంతో ఏడాది పాటు ఆటకు దూరంగా ఉన్న షమీ.. ఇటీవలే రంజీ ట్రోఫీతో పునరాగమనం చేశాడు. ప్రస్తుతం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడుతున్నాడు. ఈ రెండు టోర్నీల్లో షమీ మెరుగైన ప్రదర్శన చేయడంతో టీమిండియాలోకి పునరాగమనం చేస్తాడని అంతా అనుకున్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ లేదా మూడో టెస్ట్‌కు షమీ అందుబాటులోకి వస్తాడని కూడా వార్తలు వచ్చాయి. కానీ షమీకి బీసీసీఐ రెండు కండీషన్స్ పెట్టిందని, డెడ్‌లైన్‌లోగా వాటిని అందుకుంటేనే అతను ఆసీస్ పర్యటకు వెళ్తాడని మరో ప్రచారం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం షమీ అధిక బరువు ఉన్నాడని, అతను ఆసీస్ పర్యటనకు వెళ్లాలంటే బరువు తగ్గాలని, పూర్తి ఫిట్‌నెస్ సాధించాలని ఓ బీసీసీఐ అధికారి తెలిపాడు. 'బీసీసీఐ వైద్యబృందం నిరంతరం మహమ్మద్ షమీని పర్యవేక్షిస్తోంది. అతను ఎలా బౌలింగ్ చేస్తున్నాడనే విషయాన్ని గమనిస్తోంది. మెడికల్ టీమ్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్(ఎన్ఓసీ) వస్తేనే షమీ రీఎంట్రీపై బీసీసీఐ ఓ నిర్ణయానికి రానుంది. రంజీ ట్రోఫీతో పాటు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో షమీ బౌలింగ్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టింది. కానీ టీ20ల్లో నాలుగు ఓవర్ల స్పెల్ కాబట్టి అతని ఫిట్‌నెస్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. అతడు టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వాలంటే రెండు విషయాల్లో పాస్ అవ్వాల్సిందే. డిసెంబర్ రెండో వారం లోపే ఆ టెస్ట్‌లను క్లియర్ చేయాలి. ప్రస్తుతం షమీ అధిక బరువుతో ఉన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లాలంటే అతను బరువు తగ్గాలి. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాలి. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఉంది. ఆ టోర్నీని దృష్టిలో ఉంచుకొని సీనియర్ బౌలర్‌పై ఆందోళన లేకుండా చూడాలి.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

# ఛాంపియన్స్ ట్రోఫీకి హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించం

### పాకిస్థాన్ క్రికెట్ బోర్డు

కరాచీ: పాకిస్థాన్‌లో జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీపై వివాదం రాజుకుంటూనే ఉన్నది. ఆ టోర్నీ కోసం హైబ్రిడ్ మోడల ను వినియోగిస్తే, దాన్ని ఆమోదించబోమని ఇవాళ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తేల్చి చెప్పింది. అంతర్జాతీయ క్రికెట్ మండలికి ఈ విషయాన్ని చేరవేసింది. శుక్రవారం జరిగే ఐసీసీ బోర్డు వర్చువల్ మీటింగ్‌లో ఈ అంశమే కీలకం కానున్నది. పాకిస్థాన్‌లో ఆడేందుకు భారత్ విముఖంగా ఉన్న నేపథ్యంలో.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైబ్రిడ్ మోడల్‌ను వ్యతిరేకిస్తున్నది. తటస్థ వేదికపై భారత్‌తో తలపడేందుకు పాకిస్థాన్ ఇష్టంగా లేదు. దీంతో ఆ టోర్నీ జరుగుతుందా లేదా అన్న సందిగ్ధత ఏర్పడింది. హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించడం అంటే, ఇండియాకు




ప్రిఫరెన్స్ ఇచ్చినట్లే అవుతుందని పాకిస్థాన్ బోర్డు వాదిస్తున్నది. ఒకవేళ హైబ్రిడ్ మోడల్‌కు అవకాశం ఇస్తే, అప్పుడు భవిష్యత్తులో ఐసీసీ అన్ని హైబ్రిడ్ మోడల్‌లో మ్యాచ్‌లు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు పాకిస్థాన్ అనుమానం వ్యక్తం చేసింది. 2031లో భారత్, బంగ్లాదేశ్ కలిసి వన్డే వరల్డ్‌కప్ నిర్వహించే వరకు ఆ దేశానికి వెళ్లే పరిస్థితి ఉండదని పాక్ బోర్డు తెలిపింది. పాకిస్థాన్‌లో ఆడకూడదన్న విషయంపై భారత ప్రభుత్వం బీసీసీఐకి ఏదైనా లేఖ సమర్పించిందా అని కూడా పీసీబీ అడిగింది. ఐసీసీ ఆదాయ మార్గాల్లో బీసీసీఐ పాత్రను విస్మరించలేమని, కానీ ఇటీవల భారత్‌తో ఆడిన మ్యాచ్‌ల ద్వారా ఆదాయాన్ని ఆర్జించినట్లు పాకిస్థాన్ బోర్డు తెలిపింది.



## అర్జున్ రెడ్డి భామ ఖతర్నాక్ ఫోజులు..

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన అర్జున్ రెడ్డి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది అందాల ముద్దుగుమ్మ షాలిని పాండే. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది ఈ వయ్యారి. రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి అలరించింది. అర్జున్ రెడ్డి సినిమాలో అమాయకపు యువతిగా కనిపించిన షాలిని పాండే.. ఆ సినిమా సినిమా సక్సెస్ తర్వాత వరుసగా ఛాన్స్ లు అందుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి మెప్పించిన ఈ వయ్యారి భామ. ఇప్పుడు సినిమాల స్పీడ్ తగ్గించింది. ఇక ఈ అమ్మడు తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేసింది. కానీ అక్కడ కూడా అంతగా అవకాశాలు అందుకోలేకపోయింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా అనుష్క నటించిన నిశ్శబ్దం సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. అవకాశాలు లేకపోయినా సోషల్ మీడియాలో ఈ బ్యూటీ చేసే రచ్చ ఆంతా ఇంతా కాదు. అర్జున్ రెడ్డి సినిమాలో అమాయకంగా కనిపించిన ఈ బ్యూటీ.. సోషల్ మీడియాలో అందాలతో ఓ రేంజ్ లో గత్తర లేపుతోంది. ఇంత అందం పెట్టుకొని ఈ చిన్నదానికి అవకాశాలు ఎందుకు రావడంలేదు అని అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. షాలిని పాండే ఫోటోలకు సోషల్ మీడియాలో యమా క్రేజ్ ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.





## అఖిల్ వివాహం ఎప్పుడో చెప్పేసిన నాగార్జున

యువ హీరో అక్కినేని అఖిల్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్న విషయం తెలిసిందే. ఆయన నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో ఈనెల 26న ఘనంగా జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, అగ్ర నటుడు నాగార్జున మంగళవారం తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో అక్కినేని అభిమానులు తెగ ఖుషీ అవుతున్నారు. ఇప్పుడు వీరి వివాహం ఎప్పుడు ఉంటుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం శోభితతో డిసెంబర్ 4వ తేదీన అంగరంగ వైభవంగా జరగనున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో వివాహ వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో అఖిల్, నాగ చైతన్య పెళ్లిళ్లు ఒకేసారి చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో దీనిపై నాగార్జున తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఇద్దరి వివాహాలకు కొంత సమయం ఉంటుందని స్పష్టం చేశారు. అఖిల్ వివాహం వచ్చే ఏడాది ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. 'అఖిల్ విషయంలో నేను చాలా సంతోషంగా ఉన్నాను. అతనికి కాబోయే భార్య జైనబ్ ఒక మంచి, అందమైన అమ్మాయి. వారు ఇద్దరూ తమ జీవితాలను కలిసి గడపాలని నిర్ణయించుకున్నారు. అందుకు మేమంతా సంతోషిస్తున్నాం. వీరి వివాహం 2025లో జరుగుతుంది' అని ఓ ఇంటర్వ్యూలో నాగార్జున వివరించారు.



## ఓటీటీలో కిరణ్ అబ్బవరం క

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం రీసెంట్‌గా క సినిమాతో ప్రేక్షకులను పలుకరించాడని తెలిసిందే. 1970 ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా పాన్ ఇండియా కథాంశంతో వచ్చిన ఈ చిత్రం ఈ మూవీ తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా రిలీజై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీని థియేటర్లలో మిస్సయిన వారి కోసం డిజిటల్ ఎంట్రీ అప్‌డేట్ వచ్చేసింది. ప్రస్తుతం క పాపులర్ ఓటీటీ ప్లాట్‌పాం ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు క డాల్బీ విజన్‌లో సందడి చేస్తుండటం విశేషం. ఈటీవీ విన్‌లో డాల్బీ విజన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తొలి సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది క. ఇంకేంటి మరి డాల్బీ విజన్‌లో మీరూ చూసేయండి. సుజిత్-సందీప్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషించారు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కించిన ఈ మూవీకి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు.

## అన్నివిషయాలు అప్పుడే అర్థమవుతాయి'..

సినీ తారల వ్యక్తిగత విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి ఉండడం సర్వసాధారణం. మరీ ముఖ్యంగా హీరోయిన్ల వ్యక్తిగత వివరాలపై ఎక్కడలేని ఇంట్రెస్ట్ ఉంటుంది. హీరోయిన్లు సైతం తమ రిలేషన్ షిప్‌కి సంబంధించిన వివరాలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బాలీవుడ్ బ్యూటీ అనన్యపాండే తన రిలేషన్‌షిప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల ఇచ్చిన ఓ పాడ్‌కాస్ట్‌లో పలు విషయాలను చర్చించింది. గతంలో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్న విషయాలను పంచుకుంది. ఎదుటి వ్యక్తి కోసం నేనెంతగానో మారానని, చాలా విషయాల్లో రాజీపడ్డానని చెప్పుకొచ్చారు. బంధంలో ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తి మెప్పు పొందడం, వారి దృష్టిని ఆకర్షించడం కోసం ఏదైనా చేయాలనిపిస్తుందని తెలిపింది. మనం ఇష్టపడే వారి కోసం ఎంత మారినా ఫర్వాలేదనిపిస్తుందన్న అనన్య.. మనం మారుతున్నామనే విషయం మొదట్లో మనకు అర్థం కాదని, ఇది సహజంగానే ఉన్నట్లు అనిపిస్తుందని తెలిపింది. ప్రేమలో ఉన్నప్పుడు లోపాలు తెలియవన్న అనన్య.. ఏదీ మనకు సమస్యగా అనిపించదు. ఆ బంధం నుంచి బయటకు వచ్చినప్పుడే మీకు అన్నీ అర్థమవుతాయని చెప్పుకొచ్చింది. అయితే తాను మాత్రం రిలేషన్‌షిప్‌లో నిజాయతీగా ఉంటానని, ఎదుటి వ్యక్తి నుంచి కూడా అంతే నిజాయతీ లభిస్తే బాగుంటుందని తెలిపింది. ఇక తనకు కాబోయే వ్యక్తి, అన్నివిధాలా అర్థం చేసుకునేవాడు అయి ఉండాలని చెప్పుకొచ్చింది. కాగా అనన్య గతంలో నటుడు ఆదిత్యరాయ్ కపూర్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల వీరిద్దరూ విడిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే అనన్య చేసిన వ్యాఖ్యలు నెట్టింట కొత్త చర్చకు దారి తీశాయి.





## టీం అందరినీ మిస్ అవుతున్నా : రష్మిక

పుష్ప-2' షూటింగ్‌ను గత సోమవారం రోజున ముగించిన విషయం తెలిసిందే. దాదాపు రెండు సంవత్సరాలుగా సాగిన షూటింగ్‌కు ఆ రోజు గుమ్మడికాయ కొట్టేశారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ తాలూకు జ్ఞాపకాలను తలచుకొని ఉద్వేగానికి గురైంది కథానాయిక రష్మిక మందన్న. షూటింగ్ చివరి రోజు ఇక తాను సెట్‌లోకి రాలేనని తెలిసి ఎమోషనల్‌గా ఫీలయ్యానని రష్మిక మందన్న తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొంది. 'నవంబర్ 25 నా జీవితంలో భావోద్వేగభరితమైన రోజు. షూటింగ్ చివరి రోజు అని తెలిసి చాలా బాధపడ్డాను. ఆఖరి రోజు ఓ స్పెషల్‌సాంగ్ షూట్ చేశాం. రాత్రి వరకూ సెట్‌లోనే ఉన్నా. గత ఐదేళ్లుగా ఈ టీమ్‌తో కలిసి ప్రయాణం చేస్తున్నా కాబట్టి అది సెట్‌లాగా అనిపించలేదు. అది నా ఇల్లులా మారింది. అప్పటివరకు సినిమా కోసం పడిన కష్టం, షూట్ సమయంలోని ఎన్నో జ్ఞాపకాలు ఒక్కసారిగా కళ్లముందు కదలాడాయి. షూటింగ్ పూర్తయిందనే సంతోషం ఓ వైపు, సెట్‌ను విడిచిపోతున్నానే బాధ మరో వైపు..ఇలా ఎన్నో భావోద్వేగాలతో నా మనసు నిండిపోయింది. టీమ్ అందరిని మిస్ అవుతున్నాననే బాధతో ఒక్కసారిగా కన్నీళ్లొచ్చాయి. నేను చాలా రోజుల తర్వాత ఏడ్చాను. అలా ఎందుకు ఫీల్ అయ్యానో అర్థం కాలేదు. గొప్ప టీమ్‌తో పనిచేసినప్పుడు వారితో తెలియని అనుబంధం ఏర్పడుతుంది. ఆ ఫీలింగే నన్ను కదిలించింది' అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొంది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492